సాక్షి
నంద్యాల
బుధవారం : 26 : జూన్ : 2024



నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని ఉసగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలను నిర్వహించారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై నందికొట్కూరుకు చెందిన సాయి నృత్య కళాశాల వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల అన్నదాన పథకానికి మంగళవారం సంగారెడ్డికి చెందిన జి.రమేష్ యాదవ్ రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు.

న్యూస్‌రీల్

పచ్చర్ల చెక్‌పోస్ట్ మార్పునకు సన్నాహాలు



శిరివెళ్ల: నంద్యాల - గిద్దలూరు రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల చెక్ పోస్ట్ మార్పునకు సన్నాహాలు జరుగుతున్నాయి. అటవీ సంపద అక్రమ రవాణాను అడ్డుకునేందుకు 2019లో అధికారులు పచ్చర్లకు రెండు కిలో మీటర్ల దూరంలో చెక్ పోస్టును ప్రారంభించారు. ఈ చెక్ పోస్ట్ ద్వారా ప్రభుత్వానికి నెలకు రూ. 10 లక్షల ఆదాయం సమకూరుతుంది. అయితే చెక్ పోస్ట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలకు సిగ్నల్స్ లేక పోవడం, సెల్ ఫోన్లు పని చేయకపోవడం, ప్రతి వాహనానికి ఫాస్టాగ్ ఉండడంతో టోల్‌గేట్ వసూళ్లకు ఇబ్బందిగా మారింది. కెమెరాలు పనిచేయక పోవడంతో ఉన్నతాధికారులు కార్యాలయాల నుంచి పర్యవేక్షణ లేదు. దీంతో సిగ్నల్స్ ఉన్న సర్వ నరసింహ స్వామి ఆలయం - గాజులపల్లె మధ్య చెక్ పోస్ట్ ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

మైనర్లతో పని చేయిస్తే చర్యలు



పద్మావతినగర్‌లో హోటల్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నిసా బేగం

నంద్యాల(సిటీ): హోటళ్లు, దుకాణాలు తదితర చోట్ల 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నిసా బేగం హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాలను ఆమె సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా మైనర్లను పనిలో పెట్టుకుంటే చైల్డ్ లేబర్ యాక్ట్ కింద యజమానులకు రూ.50వేలు జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఇళ్లలో కూడా పిల్లలను పనిలో పెట్టుకోరాదని సూచించారు. లేబర్ సెస్ చెల్లించకుంటే రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సచివాలయం తెరిచేదెవరు?



ఉదయం 11 గంటలకూ.. తెరుచుకోని పేరూరు సచివాలయం

రుద్రవరం: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన సచివాలయాలు సకాలంలో తెరుచుకోవడం లేదు. ఉద్యోగుల నిర్లక్ష్యంతో ప్రజలు గంటల తరబడి సచివాలయాల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. పేరూరులో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కూడా గ్రామ సచివాలయం తలుపులు తెరుచుకోలేదు. ఒక్క ఉద్యోగి కూడా విధులకు హాజరు కాలేదు. దీంతో ఆ సచివాలయం పరిధిలోని బి.నాగిరెడ్డి పల్లె, కొండమాయపల్లె, వెలగలపల్లె గ్రామాల నుంచి పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు వేచి ఉండాల్సి వచ్చింది. 11.30 గంటల తర్వాత ఒక్కొక్క ఉద్యోగి సచివాలయానికి చేరుకున్నారు. ప్రతి ఉద్యోగి ఉదయం 9.30 గంటలకు కార్యాలయానికి చేరుకొని సాయంత్రం 5.30 గంటల వరకు విధులు నిర్వహించాలని ఆదేశాలు ఉన్నా కొందరు బేఖాతరు చేస్తున్నారు. రాకపోక వారి ఇష్టం అన్నట్లుగా వ్యవహరిసున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై ఎంపీడీఓ రామచంద్ర, ఈఓపీఆర్డీ శ్రీనివాస శర్మను అడగ్గా ఆ సచివాలయ ఉద్యోగులందరికీ మెమోలు ఇవ్వడంతో పాటు ఒక్క నెల వేతనం కట్ చేస్తామని చెప్పారు.

27న పట్టుబడిన వాహనాల వేలం

బొమ్మల సత్రం: జిల్లాలో వివిధ సెబ్ నేరాలలో పట్టుబడిన వాహనాలను ఈనెల 27వ తేదీన స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని సెబ్ సీఐ విశ్వనాథ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాల కోసం సెబ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఆట.. పాట.. భవితకు బాట

అక్కడ పలకలు.. బలపాలు..

పెన్నులు.. పుస్తకాలు కనిపించవు. బొమ్మలతోనే బోధన కొనసాగుతోంది. రోజంతా ఆటపాటలే. చిన్నారుల్లో ఆసక్తి పెంచేలా చుట్టూ రంగు రంగుల ఆట వస్తువులు. సమగ్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ కేంద్రాలు ఒత్తిడి లేని చదువుతో చిన్నారులను ప్రాథమిక విద్యకు సంసిద్ధత చేస్తున్నాయి. 3–5 ఏళ్ల లోపు వారికి పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయి.

- అంగన్‌వాడీల్లో ఒత్తిడి లేకుండా ఓనమాలు
- చదువుపై ఆసక్తి పెరిగేలా పూర్వ ప్రాథమిక విద్య
- ఓ వైపు చదువు.. మరో వైపు ఆరోగ్య పరిరక్షణ
- ఈ నెల 30 వరకు బాలసభ.. అంగన్‌వాడీ బాట
- పెరుగుతున్న చిన్నారుల హాజరు శాతం

చిన్నారులకు బొమ్మలు చూపిస్తూ విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త



ఆళ్లగడ్డ: చిన్నారుల పురోభివృద్ధికి, సమగ్ర వికాసానికి ఐసీడీఎస్ పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులపాలిట వరంగా మారాయి. కేంద్రాలకు వచ్చే బాలబాలికలను ఏదో కొంతసేపు ఆడించాం.. ఇంటికి పంపించాం అన్నట్లు కాకుండా అక్కడి సిబ్బంది చిన్నారులతో మమేకమై ఆటాపాటలతో చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహారం సైతం అందిస్తున్నారు. పోషణ లోపంతో ఇబ్బందులు పడుతున్న వారికి అదనపు ఆహారం ఇస్తూ ఆరోగ్యంగా ఎదిగేలా కృషి చేస్తున్నారు. తాజాగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈనెల 30వ తేదీ వరకు బాల సభ, అంగన్‌వాడీ బాట కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. చిన్నారులకు ఆటపాటలపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుతం విద్యార్థులపై ఉన్న ఒత్తిడి అంతా ఇంతా కాదు. మార్కులు, ర్యాంకులే లక్ష్యంగా సాగిపోతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య చదువుతున్న చిన్నారులు సైతం నలిగిపోతున్నారు. అదే అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఒత్తిడి లేని విద్య అందించడమే లక్ష్యంగా నిర్దేశించారు. ఈ మేరకు చిన్నారుల్లో విషయ పరిజ్ఞానం పెపొందించే కార్యచరణతో ముందుకు సాగుతున్నారు. ఆటలు, పాటలు, కథలతో చిన్నారులకు క్రమంగా అక్షరాభ్యాసం దిశగా అడుగులు వేయిస్తారు. పోషకాహారం సైతం అందిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. చిన్నారులు సైతం మారం చేయకుండా అంగన్‌వాడీ కేంద్రం అంటే ఇష్టంగా వెళ్లేందుకు రకరకాల బొమ్మలను అందుబాటులో ఉంచుతున్నారు.

ప్రత్యేకతలు ఇలా..

- ఆటలు, పాటలు, కథలతో పాటు సంభాషణలు నేర్పిస్తారు. మంచి అలవాట్లు అలవడేలా చొరవ చూపుతారు
- చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- యూకేజీ వరకు ప్రాథమిక విద్యను అందించి బడి అంటే భయం పోయేలా ఒకటో తరగతి నుంచి స్కూల్‌కు సంసిద్ధులను చేస్తారు.
- నిపుణులతో సూచించిన ఆట వస్తువులు ఉపయోగిస్తారు
- పిల్లలను నిరంతరం పర్యవేక్షణ చేస్తారు.



బాలసభ.. అంగన్‌వాడీ బాట.. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు, చిన్నారుల వివరాలు

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	8
అంగన్‌వాడీ కేంద్రాలు	1,620
మినీ అంగన్‌వాడీలు	43
గర్భిణులు	14,319
బాలింతలు	13,077

వయస్సు	బాలలు	బాలికలు
0 - 6 నెలల శిశువులు	8,537	8,011
7 నెలల నుంచి ఏడాది లోపు	7,641,	7,057
సంవత్సరం నుంచి 3 ఏళ్ల లోపు	25,974	24,163
3 నుంచి 6 ఏళ్ల లోపు	20,009	19,453

విద్యతో పాటు పౌష్టికాహారం

అంగ్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం సైతం అందజేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం పాలు, గుడ్లు, మధ్యాహ్నం రోజు ఒక మెనూతో భోజనం వడ్డిస్తారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది. ఆర్థిక ఇబ్బందులతో తమ పిల్లలకు పౌష్టికాహారం అందించలేక పోతున్న తల్లిదండ్రులు ఎందరో ఉన్నారు. అలాంటి వారికి అంగన్‌వాడీ కేంద్రాలు వరంగా మారాయి.



ప్రీ స్కూల్ యాక్టివిటీపై శిక్షణ ఇస్తున్న కార్యకర్త

యూకేజీ వరకు అక్కడే..

రెండున్నర సంవత్సరాలు దాటిన చిన్నారులను నర్సరీలో చేర్చుకుంటారు. మూడు సంవత్సరాల వయస్సు దాటినవారికి వారికి (ప్రీ ప్రైమరీ - పీపీ-1) నాలుగు సంవత్సరాలు పైబడిన చిన్నారులకు యూకే జీ విద్య (పీపీ-2) నేర్పుతారు. శారీరక, సాంఘిక, మానసిక, భావోద్వేగ, సృజనాత్మక, భాషాభివృద్ధి అనే ఆరు అంశాల్లో పిల్లల ప్రగతిని పరీక్షిస్తారు. ఇందులో భాగంగా రంగులు, రుచులు, శబ్దాలను గుర్తుంచుకోవడం, వస్తువులు (పుస్తకాలు, పెన్సిల్) సరిగా పెట్టుకోవడం, డస్ట్ బిన్‌లు ఉపయోగించుకోవడం, ఆటల్లో చురుగ్గా పాల్గొనడం, అభినయ గేయాలు పాడటం, అక్షరాలు రాయడం, చదవడం, చిన్నచిన్న గణితాలపై అవగాహన, బొమ్మలు గీయడం, చిత్రాలను చూసి సొంత మాటల్లో చెప్పడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. మూడు నెలలకోసారి అధ్యయన స్థాయిలను అంచనా వేస్తున్నారు. వారిని ఏ, బీ, సీ శ్రేణులుగా వర్గీకరిస్తారు. సీ శ్రేణిలోని వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ శ్రేణికి వచ్చే వరకు తీర్చిదిద్దుతారు. దీంతో పూర్వప్రాథమిక విద్య పూర్తవుతుంది. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశం కల్పిస్తారు.

ఇంగ్లిష్‌లో పాటలు పాడుతున్నాడు



నా కొడుకు గత సంవత్సరం నుంచి మా ఇంటికి దగ్గర లోనే ఉన్న అంగన్‌వాడీ బడికి పంపిస్తున్నాను. బొమ్మలు చూపిస్తే పక్షులు, జంతువులను బాగా గుర్తు పట్టడంతో పాటు ఇంగ్లిష్‌లో పాటలు బాగా పాడుతున్నాడు. నాకు చాలా సంతోషంగా ఉంది. ఖాళీ సమయంలో నేను కూడా ఇక్కడకు వచ్చి కూర్చుని ఆట పాటలు వింటుంటా.

– రాణి, పడకండ్ల

సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారులందరినీ తమ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి. ఇప్పటికే కార్యకర్తలు, సూపర్‌వైజర్లు అర్హులైన చిన్నారులను గుర్తించి నమోదు చేస్తున్నారు. ఈనెల 30 వరకు బాల సభ.. అంగన్‌వాడీ బాట.. కార్యక్రమాలు కొనసాగుతాయి. ఒత్తిడి లేని విద్య ఇక్కడే అందుతుంది. సమీపంలో ఉండే కేంద్రాల్లో ప్రవేశాలకు ఉన్న అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– నిర్మల, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

గడివేముల: వైఎస్సార్‌సీపీ కోసం పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటావనా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గడివేముల పార్టీ కార్యాలయం ఆవరణలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అన్యాయం జరిగితే కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు అందరం సిద్ధంగా ఉండాలన్నారు. అధికార పార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్‌లు రామ్మోహన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, నాయకులు ఆనంద్‌రెడ్డి, మేఘనాథరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, దేశం నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రతాపరెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఘుమాధవరెడ్డి, రమేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఓటమి తర్వాత విజయం ఉంటుందనే వాస్తవాన్ని గ్రహించి కార్యకర్తలు నిగ్రహం పాటించాలని రాష్ట్ర మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగృహంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమితో కుంగిపోకుండా ప్రతి కార్యకర్త, అభిమాని ధైర్యంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో డోన్ నియోజకవర్గాన్ని ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసిన సంగతిని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు ఈ ఎన్నికల్లో అబద్ధాల హామీలకు ఆకర్షితులైనట్లు కనిపిస్తుందన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఎలాంటి ఆపద వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు బోరెడ్డి పుల్లారెడ్డి, మల్లెంపల్లె రామచంద్రుడు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్‌లు మెట్టు వెంకటేశ్వరరెడ్డి, కొత్తకోట చంద్రన్న, డోన్, ప్యాపిలి జెడ్పీటీసీలు బద్దల రాజ్‌కుమార్, బోరెడ్డి శ్రీరాంరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబులాపురం మదన్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు తిరువాంపల్లె తిరుమలరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, పోస్టుప్రసాద్, ఆర్‌ఈ రాజవర్ధన్, యాపదిన్నె నరసింహారెడ్డి, చనుగొండ్ల మద్దిలేటి, ధర్మవరం శ్రీనివాసులు యాదవ్, ఓబులాపురం సర్పంచ్ రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైవే పనులు ఆగకూడదు

- జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

పాములపాడు: జాతీయ రహదారి 340 సీ నిర్మాణ పనులు చిన్న చిన్న కారణాలతో ఎక్కడా కూడా ఆగకూడదని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో హైవే పనులకు సంబంధించి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. కృష్ణారావు పేటలో ప్రాథమిక పాఠశాల, ఆంజనేయ స్వామి దేవాలయంతో పాటు పలువురి ఇంటి సమస్యలు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటికి ఇంత వరకు పరిహారం జమ కాలేదని, పనులు ఎలా చేస్తారని, వెంటనే క్లెయిం చేయాలని తహసీల్దార్ వెంకటరమణను ఆదేశించారు. అలాగే రుద్రవరం గ్రామంలో వీరస్వామి అనే రైతు గృహం కూల్చి వేస్తే ప్రత్యామ్నాయంగా ఉండేందుకు ఇల్లు లేదని, 15 రోజులు సమయం ఇస్తే ఇప్పటికే కొత్తగా నిర్మాణంలో ఉన్న ఇంట్లోకి వెళ్లానన్నారు. అంత సమయం లేదని, 3, 4 రోజులు సమయం ఇచ్చి తొలగించాలని జేసీ ఆదేశించారు. జెరూషలేం శాలను కూల్చేందుకు భక్తులు ససేమిరా అనడంతో వారికి రహదారి ప్రాముఖ్యతను వివరించారు. అడ్డుకునేందుకు వీలు లేదని, డిజైన్ మార్చడానికి అవకాశం లేదని చెప్పారు. ఆయన వెంట ఎన్‌హెచ్ఏఐ పీడీ గోవర్ధన్ గవిన్లా, ఆర్డీ దాసు, తహసీల్దార్ వెంకటరమణ, డీటీ పఠాన్‌బాబు, సర్వేయర్‌భాస్కర్ తదితరులు ఉన్నారు.



కృష్ణారావుపేట గ్రామంలో పర్యటిస్తున్న జేసీ

టీనా సేవలకు సెల్యూట్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసు జాగిలం 'టీనా' తన సేవలకు విరమణ పలికింది. నంద్యాల జిల్లా సాయుధ రిజర్వ్ పోలీసులు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'టీనా' సుమారు తొమ్మిదిన్నర ఏళ్లు ఉమ్మడి జిల్లాలో పోలీసు శాఖలో సేవలందించిందన్నారు. జిల్లాలో వీవీఐపీ, వీఐపీ పర్యటనలు, శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించిందన్నారు. అలాగే వివిధ కేసుల దర్యాప్తులో సహకారాన్ని అందించిందని ప్రశంసించారు. అనంతరం టీనాతో పాటు హ్యాండ్లర్ ఏఆర్ పోలీసు కానిస్టేబుల్ సుంకిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రవీణ్ కుమార్, ఏఆర్‌డీ ఎస్పీ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జాగిలం టీనాను సన్మానిస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

ఐదు రోజులు ఓ మోస్తరు వర్షాలు

నంద్యాల(సెంట్రల్): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో రాబోయే ఐదు రోజులు పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అనంతపురం జిల్లా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయ శంకర్ బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి, రీసర్చ్ అసోసియేట్ డా.జి.డి.ఉమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 33.8 – 36.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.8 - 25.4 డిగ్రీల మధ్య నమోదు కావచ్చని వారు తెలిపారు. నైరుతి దిశగా గాలులు 5 – 8 కి.మీ వేగంతో వీచే అవకాశముందన్నారు. తేలికపాటి వర్షసూచన ఉన్నందున వర్షాధార పంటలను సరైన సమయంలో విత్తుకోవటానికి రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సేకరించుకోవాలన్నారు. పదునును బట్టి వేరుశనగ, కంది, మొక్కజొన్న, సజ్జ, ఆముదం పంటలను విత్తుకోవాలని సూచించారు.

5వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా 2024–25 సంవత్సరానికి సంబంధించి 5 వేల హెక్టార్లలో బిందు, తుంపర (సూక్ష్మ సేద్యం) సాగుకు ప్రతిపాదనలు పంపినట్లు ఏపీఎంఐపీ సంచాలకులు సీ.హెచ్.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం ప్రభుత్వ ప్రోత్సాహంతో పథకం విజయవంతంగా అమలు చేసి లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. కమిషనరేట్ నుంచి ఆదేశాలు రాగానే రైతులకు వివరించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అనుమతులు వచ్చిన మేర లక్ష్యాన్ని నెలవారీగా విభజించి నిర్దేశించిన సమయంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. 5 ఎకరాలలోపు భూమి కలిగిన రైతులకు 90 శాతం రాయితీతో, 5 ఎకరాలు పైబడి 10 ఎకరాలలోపు వారికి 70 శాతం, 12 ఎకరాలలోపు పొలం ఉన్న వారికి 45 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేస్తామన్నారు. ఈ ప్రక్రియ మొదలు పెట్టిన తర్వాత ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ ఉంటుందని, డాక్యుమెంటేషన్ కంపెనీ ప్రతినిధులే చేస్తారని వివరించారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సంక్షేమ హాస్టల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్లో సంక్షేమ హాస్టళ్ల పనితీరు, విద్యార్థుల అడ్మిషన్, మౌలిక వసతులపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లన్నీ భర్తీ చేయడంతో పాటు చడంతోపాటు అత్యవసర మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూలో మార్పులు జరిగినా, ఆహారం కలుషితమైనా సంబంధిత వార్డెన్లను నేరుగా విధుల నుంచి తొలగింపుకు తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి విపరీతంగా ఉంటుందని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అందుబాటులో ఉన్న నిధులతో మస్కిటో నెట్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో 38 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 34 బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు, 13 ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లు, 46 కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఏడు అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, ఆరు జ్యోతిరావు పూలే పాఠశాలలు ఉన్నాయని వీటి పనితీరుపై ఇటీవల తహసీల్దార్లతో తనిఖీలు నిర్వహించి సమస్యలు గుర్తించామన్నారు.

మన పిల్లలు ఉంటే అలాగే చేస్తామా?

సమీక్ష సమావేశంలో ఇద్దరు వార్డెన్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బొమ్మల సత్రంలోని సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్, ఉయ్యాలవాడలోని హాస్టల్లో టాయిలెట్లు పనిచేయడం లేదని, రన్నింగ్ వాటర్ సరఫరా కావడం లేదని పలు సమస్యలు ఉన్నట్లు నివేదించారని, ఈ విషయంపై హాస్టల్ అధికారులను ఆరా తీయగా వారు ఇచ్చిన సమాధానంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే స్థానంలో 'మన పిల్లలు ఉంటే ఇలాగే చేస్తామా' అని కలెక్టర్ ప్రశ్నించారు. 'వసతులు కల్పించేందుకే మనం ఉద్యోగం చేస్తున్నామని... మన కన్నా తెలివై న వాళ్లు ఉద్యోగాలు లేక బయట తిరుగుతున్నారని ఈ విషయాన్ని గుర్తించి చేస్తున్న వృత్తిలో పనితీరు మెరుగుపరచుకొని బాధ్యతాయుతంగా ఉండాలి' అని సంక్షేమ అధికారులకు సూచించారు. అన్ని సంక్షేమ వసతి గృహాల్లో తాత్కాలిక సౌకర్యాలకు పాఠశాలల నిర్వహణ నిధుల కింద ఖర్చు చేసి అవసరమైన మరమ్మతులు చేసి మూడు రోజుల్లో నివేదికలను ఫొటోలతో సహా ఇవ్వాలని ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల ఆహార పదార్థాల సరఫరాకు సంబంధించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇండెంట్ ప్రకారం అన్ని హాస్టళ్లకు ప్రభుత్వం నిర్దేశించిన ఆహార పదార్థాలను సప్లయ్ చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతిరోజు క్లోరినేట్ చేసిన సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, డీఈఓ సుధాకర‌రెడ్డి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మీదేవి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, గురు జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లోరమ్మ, వార్డెన్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోలుకోలేక యువకుడి మృతి


వీరశేఖర్ (ఫైల్)

పత్తికొండ రూరల్: అప్పులబాధతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పత్తికొండ తేరుబజారులోని హోటల్ నిర్వాహకుడు బలిజ వీరశేఖర్ (35) చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వీరశేఖర్ టీస్టాల్ నిర్వహిస్తూ భార్యాపిల్లలను పోషించేవాడు. అవసరాలరీత్యా ప్రైవేటు వ్యక్తుల నుంచి సుమారు రూ.20 లక్షల వరకు అప్పు చేశాడు. చిరువ్యాపారి కావడంతో చేసిన అప్పులకు తోడు వడ్డీల భారం అధికమై ఎలా తీర్చాలనే బెంగతో మనోవేదనకు గురయ్యేవాడు. తనకు అప్పుడప్పుడు వచ్చే ఫిట్స్ కంట్రోల్ కోసం ఇంట్లో ఉంచుకున్న మాత్రలను రెండు రోజుల క్రితం అధిక మోతాదులో వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న శేఖర్‌ను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడే కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన సింహాద్రి

కొలిమిగుండ్ల: ప్రేమ వివాహాన్ని కుటుంబ సభ్యులు నిరాకరించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం కొలిమిగుండ్లలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ సమీపంలో నివాసముంటున్న ఎరుకలి పుల్లయ్య కుమారుడు సింహాద్రి (20) అనంతపురానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయిని కులాంతర వివాహం చేసుకుంటానని కుటుంబ సభ్యులకు చెప్పడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థి బలవన్మరణం

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామానికి చెందిన విద్యార్థి మహేష్(21) మంగళవారం ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివమ్మ కుమారుడు మహేష్(21) ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ చదువుతున్నాడు. చివరి సంవత్సరానికి సంబంధించి ఒక సబ్జెక్ట్ ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సీనియర్ అకౌంటెంట్‌కు పదోన్నతి


టి.సుభాషినికి రిలీవింగ్ ఉత్తర్వులను అందజేస్తున్న జేడీ కృష్ణ

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా కర్నూలు జాయింట్ డైరెక్టర్ కార్యాలయ సీనియర్ అకౌంటెంట్ టి.సుభాషినికి పదోన్నతి లభించింది. ఈమెకు సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు ఏపీజీఎల్ఐ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఇటీవల ఏపీజీఎల్ఐ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె మంగళవారం రిలీవ్ అయ్యారు. పదోన్నతిపై వెళ్తున్న సుభాషినిని కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ప్రబలుతున్న అతిసారం

- గ్రామాల్లో పెరుగుతున్న కేసులు
- డాక్టర్ల వద్దకు క్యూ కడుతున్న రోగులు
- జూపాడుబంగ్లా, ఇస్వి, నెరణికి తండాల్లో కేసుల నిర్ధారణ
- ఆహారం, తాగునీరు కలుషితం కావడమే కారణమంటున్న వైద్యులు
- ప్రత్యేక వైద్యశిబిరాలతో వైద్యసేవలు

అతిసార వ్యాధి విజృంభిస్తోంది. కడుపునొప్పి, విరేచనాలు తదితర లక్షణాలతో వైద్యుల వద్దకు క్యూ కట్టే జనం రోజురోజుకు ఎక్కువవుతున్నారు. వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితం కావడం, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడం కూడా కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. అక్కడక్కడా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నా పూర్తి స్థాయిలో అదుపులోకి రావడం లేదు.


వైద్యశిబిరంలో మందులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో అతిసార వ్యాధి విజృంభిస్తోంది. నగరాలు, పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రతిచోటా అతిసార వ్యాధి బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కడుపునొప్పి, విరేచనాలు తదితర లక్షణాలతో వైద్యుల వద్దకు క్యూకడుతున్నారు. ఇలాంటి వారికి గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో, పీహెచ్‌సీల్లో మెట్రోనిడజోల్‌తో పాటు విరేచనాలు తగ్గేందుకు మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చి పంపిస్తున్నారు. పట్టణాల్లోని ప్రైవేటు వైద్యులైతే విరేచనాలు తగ్గేందుకు ఆధునిక మందులతో పాటు ఖరీదైన యాంటీబయాటిక్ మందులను ఇస్తున్నారు. ఎవరు ఎలాంటి మాత్రలు ఇచ్చినా నాలుగైదు రోజుల్లో విరేచనాలు సర్దుకుంటున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జూపాడుబంగ్లాలోని బన్నూరు, ఆదోని మండలంలోని ఇస్వి, హొళగుంద మండలం నెరణికి తండాలో అతిసార వ్యాధి కేసులు వెలుగులోకి వచ్చాయి. ఆయా గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెళ్లి వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు అవసరమైన మందులు పంపిణీ చేయడమే గాక నివారణ చర్యలు సూచించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ఒకరిద్దరు కడుపునొప్పి, విరేచనాలతో వైద్యుల వద్దకు వెళ్తున్నారు.

తాగునీరు కలుషితం కావడం వల్లే..

పట్టణాలు, గ్రామాల్లోని తాగునీటి పైపులైన్లు ఎక్కువగా మురికినీరు ప్రవహించే కాలువల్లో లేదా వాటి పక్కన వెళ్తుంటాయి. ఇవి ఎక్కడో ఒకచోట లీకేజీ అయినా ఉద్యోగులు గుర్తించని పరిస్థితి. ఈ క్రమంలో ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మురికి కాలువలు నిండి పారుతున్నాయి. దీంతో పైపు లైన్లలోని తాగునీరు కలుషితమవుతోంది. ఆ నీటిని తాగిన ప్రజలు కడుపునొప్పి, విరేచనాలకు గురవుతున్నారు. ఇవి నివారించాలంటే ఈ సీజన్‌లో ప్రజలు తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. దీనికితోడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి పైపులైన్లు లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. మరోవైపు పంచాయతీ సిబ్బంది పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ఇది జరగడం లేదు. మురికికూపాలపై కూర్చున్న ఈగలు సైతం ఆహార పదార్థాలపై వాలడం వల్ల సదరు ఆహారం తిన్న వారికి సైతం కడుపునొప్పి, విరేచనాలు అవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

అతిసార వ్యాధి అంటే..

లూజు లేదా నీళ్ల బేదులనే అతిసార వ్యాధిగా పిలుస్తారు. ఒక వ్యక్తి ఒక రోజులో మూడు లేదా అంతకుమించిన సార్లు లూజు లేదా నీళ్ల బేదులు చేసుకుంటే డయేరియాగా గుర్తిస్తారు. వైరస్, బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి కలుషితమైన నీటిని తాగడం, ఆహారాన్ని తినడం వల్ల వస్తుంది. అతిసార వ్యాధి వల్ల శరీరంలోని లవణాలు కోల్పోయి మనిషిని నిస్సత్తువ ఆవరిస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే కొన్నిసార్లు ఇది ప్రాణాపాయానికి దారి తీస్తుంది.

వ్యాధి లక్షణాలు

పొత్తికడుపు పిండేసినట్లు ఉండటం, కడుపునొప్పి, పొత్తికడుపు ఉబ్బటం, దప్పిక ఎక్కువ, బరువు తగ్గటం, జ్వరం, కడుపులో వికారం, అకస్మికంగా మలవిసర్జనకు వెళ్లాలనే ఆతృత, లూజు బేదులతో పాటు ఇతర తీవ్రమైన లక్షణాలతో కలిసి కూడా రావచ్చు. మలంలో రక్తం పడటం, ఎడతెగని వాంతులు వంటి లక్షణాలు ఉంటాయి. రెండు రోజులకు మించి ఎక్కువగా బేదులు వస్తుంటే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి.

చికిత్స

సాధారణ మందులతో విరేచనాలు నయమవుతాయి. అతిసార వ్యాధితో పాటు జ్వరం ఉంటే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. చిన్నపిల్లల్లో అతిసార వ్యాధికి చిన్నపిల్లల వైద్యులను కలిసి చికిత్స అందుకోవాలి. కొన్నిరకాల బ్యాక్టీరియా సహిత అతిసార వ్యాధికి యాంటీబయాటిక్ మందులు తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. వీటితో పాటు క్రోన్, అల్సరేటివ్ కొలైటిస్, ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ వల్ల వచ్చే అతిసార వ్యాధికి వైద్యులు నిర్దిష్టమైన మందులు సూచిస్తారు.

తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు

- జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా అతిసార వ్యాధిని త్వరగా పరిష్కరించవచ్చు. భవిష్యత్‌లో రాకుండా నివారించుకోవచ్చు. -బాత్‌రూమ్‌ను ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి.
- వంటచేసే ముందు, వంట చేసిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలి. డైపర్స్ మార్చిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలి.
- మరిగించిన లేక బాటిల్‌లోని ప్యూరిఫైడ్ నీటిని తాగాలి.
- వేడిగా ఉన్న పానియాలను తాగాలి.

“అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని చర్యలు



అతిసారం /డయేరియా ప్రబలకుండా సంబంధిత శాఖలతో కలిసి చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఐసీడీఎస్‌లతో మా మెడికల్ ఆఫీసర్లతో ఇటీవల జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను చర్చించాం. వ్యాధి ప్రబలిన ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకున్నాం. అతిసార వ్యాధికి గురైన వారికి చికిత్స అందించడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. పంచాయతీ సిబ్బంది ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల ద్వారా నీటి ట్యాంకులు శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాం. ఐసీడీఎస్ వారితో గర్భిణులు, పిల్లలకు వండే ఆహారాన్ని పరిశుభ్రమైన పరిస్థితుల్లో వండాలని, పిల్లలు చేతులను శుభ్రంగా కడుక్కుని తినాలని సూచిస్తున్నాం. సున్నా నుంచి ఆరు నెలల పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశాం. పిల్లలకు అతిసారం రాకుండా ముందు జాగ్రత్తగా ప్రతి ఇంటికీ జింక్ మాత్రలు, సిరప్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి విరేచనాలు వస్తే అవి వాడే విధానాన్ని మా సిబ్బంది ద్వారా తెలియజేస్తున్నాం. – డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు


గ్రామంలో పర్యటిస్తున్న వైద్య సిబ్బంది

- శిశువులకు, చిన్నపిల్లలకు వయస్సుకు తగిన ఆహారాన్ని ఇవ్వాలి.
- ఆరు నెలల వరకు తల్లిపాలను తప్పనిసరిగా ఇవ్వాలి.
- ఆహారాన్ని సక్రమంగా నిల్వ చేయాలి.

వీటికి దూరంగా ఉండాలి

- శుద్ధిచేయని నీటిని తాగరాదు.
- శుద్ధి చేయని నీటితో తయారైన జ్యూస్‌లు, పానీయాలు, ఐస్‌లకు దూరంగా ఉండాలి.
- అన్‌పాస్చురైజ్డ్ పాలు తాగకూడదు.
- రోడ్డు పక్కన ఉండే ఆహారాన్ని తినకూడదు.
- పచ్చివి, వండని ఆహారాన్ని, మాంసాన్ని తినకూడదు.
- ఆల్కహాలు, పానీయాలకు దూరంగా ఉండాలి.
- మసాల పదార్థాలు తగ్గించాలి.
- కాఫీ, టీలు పరిమితం చేయాలి

డీఈఓ వర్సెస్ సమగ్ర శిక్ష ఏపీసీ


- కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఏపీసీగా బాధ్యతలు చేపట్టిన డీఈఓ
- తనను రిలీవ్ చేయడానికి డీఈఓ ఎవరంటూ సీటులోనే ఏపీసీ

కర్నూలు(సిటీ): కర్నూలు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ విజయ జ్యోతి కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ మధ్య సమన్వయ లోపం కారణంగా తరచూ ఏదో ఒక వివాదం చోటు చేసుకుంటోంది. వాస్తవానికి ఏపీసీకి గత జనవరి 31న వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు బదిలీ చేశారు. అయితే అప్పట్లో ఆమె రిలీవ్ కాలేదు. ఇదే విషయాన్ని ఫిబ్రవరి నెలలో సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంటనే రిలీవ్ కావడంతో పాటు డీఈఓకు బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల సమయం కావడంతో అప్పట్లో జిల్లా కలెక్టర్ రిలీవ్ చేయలేదని తెలిసింది. తాజాగా ఎన్నికలు ముగియడంతో జిల్లా కలెక్టర్ ఏపీసీని రిలీవ్ చేస్తూ బాధ్యతలు డీఈఓకు అప్పగించాలని ఆదేశించారు. ఈ మేరకు డీఈఓ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. అయితే మంగళవారం ఏపీసీ రిలీవ్ కాకుండా సీటులో కూర్చొని అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఏపీసీ విజయ జ్యోతి కుమారిని వివరణ కోరగా గత ప్రభుత్వం ఇచ్చిన బదిలీ ఆర్డర్ చెల్లదని, పైగా కలెక్టర్ నుంచి తనకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని చెప్పడం గమనార్హం. జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్‌ను సంప్రదించగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీసీగా బాధ్యతలు స్వీకరించానని, కలెక్టర్ రిలీవింగ్ ఆర్డర్ ఇచ్చారని సమాధానమిచ్చారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై వేటు


పాణ్యం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రిపై వేటు పడింది. విద్యార్థు నుంచి ఫిర్యాదులు రావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఆర్‌జేడీ నాగలింగారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ 'సాక్షి'తో ఫోన్ మాట్లాడుతూ సిబ్బంది, విద్యార్థుల నుంచి భారీగా ఫిర్యాదులు అందడంతో విచారించి ఉన్నతాధికారులు ఆదేశాలతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

సచివాలయ శిలాఫలకం ధ్వంసం


ధ్వంసమైన శిలాఫలకం

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన ప్రభుత్వ భవనాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేస్తున్నారు. మండలంలో ఇటీవల ఎస్‌హెచ్ ఎర్రగుడిలో ఆర్బీకే, టి.గోకులపాడులో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినా శిలాఫలకాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం రాత్రి కృష్ణగిరి పోలీస్‌స్టేషన్‌కు 100 అడుగుల దూరంలో ఉన్న సచివాలయం వద్ద ఉన్న శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. టీడీపీ వారే ఓర్వలేక ధ్వంసం చేసి ఉంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ మాట్లాడుతూ శిలాఫలకం ధ్వంసంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శిని ఆదేశించామన్నారు.

ముప్పవల్లెలో...



ఆత్మకూరురూరల్: ముప్పవల్లె గ్రామంలోని రైతు భరోసా కేంద్రం శిలాఫలకాన్ని అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలను నిలువరించేందుకు కొందరు గ్రామస్తులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత సచివాలయంపై రాళ్లు విసిరారు. దీంతో సచివాలయ ఎలివేషన్‌లో పెట్టిన అద్దాలు పెళ్లలిచ్చాయి. మరనటి రోజు సచివాలయానికి వచ్చిన ఉద్యోగులు ఈ విధ్వంసం చూసి నివ్వెర పోయారు. సచివాలయ మహిళా పోలీసు జరిగిన విషయాన్ని ఆత్మకూరు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

ధ్వంసమైన ఆర్‌బీకే శిలాఫలకం

మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దు


మాట్లాడుతూ అడిషనల్ ఎస్పీ నాగరాజు


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు: మాదకద్రవ్యాల జోలికెళ్లి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా అదనపు ఎస్పీ నాగరాజు సూచించారు. ఈనెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ నాగరాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువకుల్లో కొందరు జైలు పాలవుతుండగా, మరి కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా వాటిని కలిగివున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్, వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్‌రెడ్డి, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కేవీ రత్నం, విజయుడు, నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

కంకర అక్రమ తరలింపుపై తనిఖీలు


చైతన్య ప్రాజెక్ట్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన గనుల శాఖ డీడీ, విజిలెన్స్ అధికారులు

కర్నూలు (టౌన్): కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో కంకర అక్రమంగా తరలింపుపై మంగళవారం గనుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కంకరను అక్రమంగా తరలించినట్లు గుర్తించిన అధికారులు గ్రామంలో ఏర్పాటు చేసిన చైతన్య ప్రాజెక్ట్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గాలిమరల నిర్మాణానికి ఎక్కువ మోతాదులో కంకర తరలించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని గనుల శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో గనుల శాఖ విజిలెన్స్ అధికారి బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నారు.

వామ్మో.. చిరుత

- నల్లమల పల్లెవాసులను భయపెడుతున్న చిరుతలు
- నెల రోజుల వ్యవధిలో నలుగురిపై దాడి
- తాజాగా పచ్చర్లలో ఓ మహిళ చిరుతకు బలి



మహానంది: చిరుత పేరు వినిపిస్తే చాలు నల్లమల అటవీ పరిసర గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. ఒంటరిగా బయటకు వెళ్లాలంటే వణికిపోతున్నారు. రాత్రి వేళల్లో ఏదైనా అరుపులు వినిపిస్తే చాలు తెల్లవార్లు జాగారమే చేయాల్సి వస్తుంది. నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మెహరున్నీసాపై తాజాగా చిరుతపులి దాడి చేసి తలను తినేసిన సంఘటన స్థానికులను కలచివేసింది. కట్టెపుల్లల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లిన ఆమెపై చిరుతపులి దాడి చేయడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఇదిలా ఉండగా మహానందిలోనూ చిరుతపులి సంచారంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నంద్యాల, ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లోని నల్లమల అడవి పరిసరాల్లో ఉన్న గ్రామాల సమీపంలో చిరుతపులులు సంచరిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే నలుగురు చిరుతపులి దాడిలో గాయపడ్డారు. ఇటీవల అటవీశాఖలోని మూడాకుల గడ్డ ప్రాంతంలో ఉన్న లెవర్ బేస్ క్యాంపులో విధులు నిర్వహించే అజీమ్‌బాషాపై చిరుతపులి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే. అనంతరం గిద్దలూరు మార్గంలోని అటవీ చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న ఓ ఉద్యోగిపై దాడి చేసి గాయపరిచింది. రైల్వే పనులకు వచ్చిన ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన పాండవ అనే బాలికపై దాడి చేయగా తలకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. శిరివెళ్ల మండల పరిధిలోని నల్లమలలో ఉన్న పచ్చర్ల గ్రామానికి చెందిన షేక్ బీబీ వారం రోజుల క్రితం నిద్రిస్తుండగా చిరుతపులి దాడి చేసి గాయపరిచింది. తాజాగా మంగళవారం అదే గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మోహరున్నీసా కట్టెపుల్లల కోసం వెళ్లగా దాడి చేసి తలను తినేసింది. ఇదిలా ఉండగా పచ్చర్ల సమీపంలోని చిరుతపులిని పట్టుకునేందుకు సీసీ కెమెరాలతో పాటు బోను ఏర్పాటు చేశామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

మహానందిలో భయం...భయం..

మహానంది పుణ్యక్షేత్రం పరిసరాల్లో వారం రోజుల నుంచి చిరుతపులి సంచరిస్తున్న విషయం తెలిసిందే. దేవస్థానానికి చెందిన గోశాల, అన్నప్రసాద వితరణ కేంద్రం, పాత వివేకానంద పాఠశాల ప్రాంగణాల్లో చిరుతపులి సంచరిస్తుంది. దీంతో స్థానికులతో పాటు భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. వరుస దాడి ఘటనలు జరుగుతున్నా అటవీశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం బాధాకరం. అటవీశాఖ అధికారులు స్పందించి మహానంది, పచ్చర్ల గ్రామాల పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతను బంధించి సుదూర ప్రాంతాలకు తరలించాలని నల్లమల పరిసర గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పండ్ల తోటల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

- డ్వామా పీడీ అమరనాథరెడ్డి ఆదేశం


మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు (అగ్రికల్చర్): ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయం నుంచి ఏపీడీ, ఏపీఓ, ఈసీ, టీఏలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2024-25లో 10 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు గుర్తించిన 5,150 ఎకరాల రైతుల భూముల్లో పండ్ల మొక్కలు నాటేందుకు ఎస్టిమేట్లు జనరేట్ చేయడాన్ని ముమ్మరం చేయాలన్నారు. పరిపాలన అనుమతులు లభించిన రైతుల భూముల్లో గుంతలు తవ్వే పనులను చేపట్టాలన్నారు. పండ్లతోటల సాగు వల్ల కలిగే ఉపయోగాలు, ఉపాధి హామీ పథకం నుంచి లభించే ప్రోత్సాహకాలను రైతులకు అవగాహన కల్పించాలన్నారు.